క్లుప్తంగా

వ్యక్తిగత శుభ్రతను పాటించాలి



ఆరోగ్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సునీత

సి.బెళగల్: వసతి గృహాల విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతను పాటించాలని, అప్పుడే ఆరోగ్యంగా ఉంటారని సి.బెళగల్ పీహెచ్‌సీ డాక్టర్ సునీత సూచించారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ బలరాముడు ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. అవసరం మేరకు విద్యార్థులకు మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ మద్దిలేటి పాల్గొన్నారు.

ముందస్తు క్రిష్ణాష్టమి వేడుకలు



శ్రీకృష్ణుడి వేషధారణలో విద్యార్థులు

సి.బెళగల్: మండలంలోని బురాన్‌దొడ్డి ప్రాథమిక పాఠశాలలో శనివారం ముందస్తు శ్రీకృష్ణుడి జన్మదిన (కృష్ణాష్టమి) వేడుకలు నిర్వహించారు. శ్రీకృష్ణుడి వేషధారణలో విద్యార్థులు అలరించారు. చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆది, సోమవారాలుసెలవు దినాలుగా ఉండడంతో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించామని హెచ్‌ఎం సావిత్రి తెలిపారు. కార్యక్రమంలో టీచర్లు దస్తగిరి, వెంకటపుల్లాయ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

కోనా వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన శ్రీ కోనా వేంకటేశ్వర స్వామికి శనివారం పూజారులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. భూదేవి, అలివేలిమంగమ్మ సమేత శ్రీ కోనా వేంకటేశ్వర స్వామి మూల విగ్రహాలకు అభిషేకం తదితర పూజలు చేశారు. స్థానికులతోపాటు సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పుల్లకుర్తి, పోలకల్, ఇనగండ్ల గ్రామాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

పాఠశాలల అభివృద్ధికి సహకరించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి

కల్లూరు: పాఠశాల అభివృద్ధికి మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్లు, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు సహకరించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఈఓలు శ్రీనివాసులు, వనజకుమారి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ భవనంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్‌ఎంసీ చైర్మన్లు బుధ, శుక్రవారం పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించాలన్నారు. అలాగే సోమ, గురువారం గ్రామ సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు పర్యవేక్షించాలన్నారు. మొక్కల పెంపకం, పరిశుభ్రత మొదలగు అంశాల గురించి ఎస్‌ఎంసీ చైర్మన్లకు వివరించారు.

దేశ సంస్కృతిపై అవగాహన



మాట్లాడుతున్న నాగర్జునరెడ్డి

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో దేశ సంస్కృతిక వైభవంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నంద్యాలకు చెందిన వివేకానంద సేవాసమితి సభ్యులు నాగార్జునరెడ్డి, రాఘవ విశ్వనాథ్, సుబ్బారావు దేశ సంస్కృతి సంప్రదాయాలను వివద్యార్థులకు వివరించారు.

వసతి గృహాల స్పెషల్ ఆఫీసర్‌గా రామలింగేశ్వర్

కర్నూలు (టౌన్): నగరపాలక పరిధిలోని సంక్షేమ వసతి గృహాలకు నగరపాలక కమిషనర్ రామలింగేశ్వర్‌ను స్పెషల్ ఆఫీసర్‌గా నియమించారు. శనివారం జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా ఈ బాధ్యతలు అప్పగించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రాత్రి క్రిష్ణానగర్‌లోని ప్రభుత్వ బీసీ కళాశాల బాలికల వసతి గృహాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు పట్టికను, వసతి గృహంలో వసతులను పరిశీలించారు. అక్కడే ఉన్న వసతి గృహ అధికారి ప్రమీలతో మాట్లాడారు. ఏవైనా సమస్యలు, ఫిర్యాదులు ఉంటే తెలియజేయాలని సూచించారు. వసతి గృహంలో ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరారు.

మనోధైర్యం దెబ్బతింటోంది



కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటన బాధాకరం. ఇలాంటి సంఘటనలతో వైద్య సేవకుల మనోధైర్యం దెబ్బతింటోంది. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా ఘటన నిందితులను కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉది. వైద్యసేవందించే డాక్టర్లు, సిబ్బంది రక్షణకు అధికారయంత్రాంగం ఇప్పటికైనా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలి. ఆసుపత్రులలో భద్రతను కట్టుదిట్టంగా ఏర్పాటు చేయాలి. నియమ నిబంధనలు నిక్కచ్చితంగా పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– మౌలాబీ, ఏఎన్‌ఎం, గడిగరేవుల, గడివేముల మండలం



పటిష్ట భద్రత చర్యలు తీసుకోవాలి



కోల్‌కతా జూనియర్ వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన మృగాలను కఠినంగా శిక్షించాలి. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా ఇప్పటికైనా అధికారులు కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అన్ని వేళలలో వైద్యులు సేవలు చేసే మాకు మాత్రం రక్షణ లేకపోవడం దారుణం. వైద్యులు, వైద్య సిబ్బందిపై కొంతమంది చాలా దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ఇలాంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలి. భద్రత పెంచాలాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ సునీత, సి.బెళగల్ పీహెచ్‌సీ వైద్యురాలు

శుద్ధజల కేంద్రానికి సుస్తీ!

- ఓర్వకల్లులో ఇరవై రోజులుగా మూతపడిన మినరల్ వాటర్ ప్లాంట్
- తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న పేదలు



ఓర్వకల్లులో మూతపడిన వాటర్ ప్లాంట్

ఓర్వకల్లు: మండల కేంద్రం ఓర్వకల్లు గ్రామంలో ఆంజనేయ స్వామి వద్ద నిర్మించిన శుద్ధజల కేంద్రానికి సుస్తీ చేసింది. ఏళ్లతరబడి సాగుతున్న మినరల్ వాటర్ ప్లాంట్ అధికారుల నిర్లక్ష్యం మూలంగా మూతపడిందనే విమర్శలు లేకపోలేదు. కేవలం ఐదురూపాయలకే 20 లీటర్ల క్యాన్ ఇస్తుండడంతో పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. ఓర్వకల్లుతోపాటు సమీప గ్రామాలైన గుట్టపాడు, కన్నమడకల ప్రజలు ఇక్కడికే వచ్చి తాగునీటిని తీసుకెళ్తుంటారు. అదేవిధంగా స్టీల్ ప్లాంట్ కార్మికులు ప్లాంట్ మంచినీరు ఎంతో ఉపయోపడేవి. ప్రస్తుతం ప్లాంట్ మూడపడడంతో పేదలు చాలా ఇబ్బంది పడుతున్నారు. అధికారులు చొరువ తీసుకుని వాటర్ ప్లాంట్ తెరిపించాలని కోరుతున్నారు.

పదిహేనేళ్ల క్రితం నిర్మించిన వాటర్ ప్లాంట్

15 ఏళ్ల క్రితం గ్రామస్తులు కుళాయి నీటిని తాగేవారు. ప్రజలు తరుచుగా అనారోగ్యాలకు గురయ్యేవారు. స్థానిక నాయకులు గ్రామంలో శుద్ధజల ప్లాంట్‌ను నిర్వహించాలని వీఎస్‌టీ పొగాకు కంపెనీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు కంపెనీ ప్రతినిధులు ప్లాంట్ నిర్మించేందుకు ముందుకొచ్చారు. హైదరాబాద్‌కు చెందిన వీఎస్‌టీ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ యాజమాని లక్ష్మినరసింహయ్య 2011 జూన్ 17వ తేదీన సేఫ్ డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టును(సురక్షిత మంచినీటి పథకం) ప్రారంభించారు. ప్లాంట్‌కు నీటిని గ్రామపంచాయతీ బోరు ద్వారా సరఫరా చేయాలని ఒప్పందం కుదుర్చుకున్నారు. పదేళ్ల ఒప్పందం మేరకు ప్లాంట్ నిర్వహిస్తామని పంచాయతీ బోర్డు ఆమోదం తెలపింది. మూడేళ్ల క్రితం ఒప్పందం ముగిసింది. అయితే గత రెండేళ్లుగా ప్లాంట్‌లో పనిచేస్తున్న వ్యక్తికి నెలకు రూ.6 వేలు చొప్పున మూడు నెలల వేతనం ఇవ్వాల్సి ఉంది. ఆ జీతం నిమిత్తం ప్లాంట్ నిర్వహణను ఆ వ్యక్తికి అప్పగించారు.

వేలంపాట కోసమేనా..?

మినరల్ వాటర్ ప్లాంట్‌కు వేలం పాట నిర్వహించాలని కొందరు స్థానికులు పట్టుపట్టడడంతో ప్రస్తుతం నిర్వహిస్తున్న వ్యక్తి బాధ్యతల నుంచి స్వచ్ఛందంగా తప్పుకున్నట్లు సమాచారం. అయితే ఏ మాత్రం గిట్టుబాటు అవ్వని ప్లాంట్ నిర్వహణపై ఎందుకు రాజకీయం చేస్తున్నారనే విషయం ఎవ్వరికీ అర్థమవ్వని ప్రశ్న. కేవలం రూ. 5 చొప్పున 20 లీటర్లు చొప్పున విక్రయిస్తే ఏ మాత్రం గిట్టుబాటు కాదని, రోజుకూలి కూడా గిట్టదని ఇంత వరకు ప్లాంట్‌న నిర్వహణ చూసిన వ్యక్తి తెలిపాడు. అరకొర కూలి వస్తున్నా... ప్రజల తాగునీటి సమస్య తీరుస్తున్నామనే తృప్తితోనే కొనసాగించానంటున్నాడు కూడా. అయితే పంచాయతీ అధికారుల జోక్యంతోనే ప్లాంట్ మూతపడిందనే స్థానికులు చర్చించుకుంటున్నారు. సమస్య ఏదైనా మళ్లీ వాటర్ ప్లాంట్‌ను అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్లాంట్‌ను కొనసాగించాలి



గతంలో కొళాయిని నీటిని తాగేవాళ్లం. మా ఇంటవద్దనే ప్లాంట్ నిర్మించడంతో పదేళ్లుగా ఫిల్టర్ నీటికి అలవాటు పడ్డాం. మిగతా చోటకంటే ఇక్కడ తక్కువ ధరకే క్యాన్ నీటిని అమ్మడంతో చుట్టుప్రక్కల వారు కూడా ఇదేనీటిని తాగుతున్నారు. ప్రస్తుతం ప్లాంట్ మూతపడడంతో తాగునీటికి ఇబ్బందిగా ఉంది. ఎవరైనా ప్లాంట్‌ను నిర్వహిస్తే బాగుంటుంది.

– ఎస్‌ఎండీ గౌసు, స్థానికుడు

తాగునీటి సమస్యను పరిష్కరించాలి



మూతపడిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి తాగునీటి సమస్యను పరిష్కరించాలి. అధికారులు చొరువ తీసుకుని ప్లాంట్‌ను తెరిపించాలి. గతంలో ఆంజనేయస్వామి బావినీళ్లు ఎంతో రుచికరమైనవి కావడంతో ప్రజలు ఆ నీటిని తాగేందుకు అధికశాతం మొగ్గుచూపుతారు. ఆ స్థలంలో నిర్మించిన బోరునీటిని మినరల్ వాటర్ ప్లాంట్‌కు సరఫరా చేయడంతో నీటికి మరింత ఆదరణ పెరిగింది.

–కురువ చిన్నస్వాములు, స్థానికుడు

డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాములు గౌడ్

కోడుమూరు రూరల్: కోడుమూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శులు రంగస్వామి, శ్రీరాములు గౌడ్ డిమాండ్ చేశారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గ కేంద్రమైన కోడుమూరులో డిగ్రీ కళాశాల లేక ఏన్నో ఏళ్లుగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా పాలకులు మాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఆదాయం వచ్చే పనుల కోసం ప్రజాప్రతినిధులు పోటీ పడుతున్నారే తప్పా విద్యాభివృద్ధికి మాత్రం కృషి చేయడం లేదన్నారు. నాయకులు వీరాంజనేయులు, అల్తాఫ్, మహమ్మద్, విశ్వనాథ్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

మనోభావాలు దెబ్బతింటే ఊరుకోం

కర్నూలు సిటీ: కోడుమూరు నియోజకవర్గంలో ప్రభుత్వ కార్యక్రమాల్లో బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని, తమ మనోభావాలు దెబ్బతింటే సహించమని బీజేపీ నియోజకవర్గ మాజీ కన్వీనర్ సద్దల మధు కిషోర్ హెచ్చరించారు. స్థానిక తెలుగుదేశం ప్రజాప్రతినిధులు నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని ఆయన శనివారం ఓ ప్రకటనలో ఖండించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్నది కూటమి ప్రభుత్వం అన్న విషయాన్ని మరువరాదన్నారు. ఎమ్మెల్యే స్వగ్రామం పసుపలలోనే కూటమి ధర్మం అమలు కాకపోతే నియోజకవర్గంలోని మిగిలిన చోట్ల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించవచ్చునన్నారు. ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహించిన గ్రామ సభలకు ఎక్కడా కూడా బీజేపీ నాయకులను పిలవడం లేదని చెప్పారు.

విద్యార్థుల ప్రతిభ అభినందనీయం

- పీడీ అమర్‌నాథ్‌రెడ్డి



మధ్యాహ్న భోజన వసతిపై ఆరా తీస్తున్న పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

ఓర్వకల్లు: క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి పోటీలకు మీదివేముల పాఠశాల ఎంపిక సంతోషకరమని, విద్యార్థుల ప్రతిభ అభినందనీయమని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మీదివేముల జెడ్పీ హై స్కూల్‌ను శనివారం పీడీ తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. విద్యాబోధన, విద్యార్థుల ప్రతిభపై ఆరాతీశారు. మధ్యాహ్న భోజన వసతిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయంలో నిర్వహించిన జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో అత్యుత్తమ ప్రతిభను కనబరచినట్లు హెచ్‌ఎం శ్రీనివాసయాదవ్ తెలిపారు. దీంతో ఈ నెల 29వ తేదీన క్రీడా దినోత్సవం సందర్భంగా జరిగే జిల్లా స్థాయి పోటీలకు మీదివేముల పాఠశాలను ఎంపిక చేశారని చెప్పారు. విద్యార్థులను క్రీడల్లో ప్రతిభావంతులుగా తీర్చిదిద్దిన పీఈటీ శేఖర్, హెచ్‌ఎం శ్రీనివాసయాదవ్‌ను ఈ సందర్భంగా పీడీ అభినందించారు. అనంతరం సమీంలోని బీసీ హస్టల్‌ను సందర్శించారు. అక్కడ వృథాగా పారుతున్న కుళాయిలకు టాప్‌లు అమర్చి, స్విచ్ బోర్డులను రిపేరు చేయించాలని వార్డెన్ రాఘవేంద్రను ఆదేశించారు. వంటసరుకులు, కూరగాయాలను పరిశీలించిన పీడీ విద్యార్థులకు సరిపడా భోజనం పెడుతున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు ప్రహారీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఏపీఓ కుమార్‌సాయినాథ్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస యాదవ్, ఏపీఓ కుమార్‌సాయినాథ్, వార్డెన్ రాఘవేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల ఫొటోలు అప్‌లోడ్ చేయాలి



మాట్లాడుతున్న ఎంఈఓ సుబ్రహ్మణ్యం

పాణ్యం: ప్రతి పాఠశాలలో మరుగుదొడ్ల ఫొటోలు తప్పకుండా అప్‌లోడ్ చేయాలని ఎంఈఓ–2 సుబ్రహ్మణ్యం సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం హెచ్‌ఎం, ఎస్‌ఎంసీ సభ్యులు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో నిర్వహించిన సమావేశంలో ఎంఈఓ మాట్లాడారు. వారంలో రెండు రోజులు వెల్ఫేర్ అసిస్టెంట్లు, రెండు రోజులు ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు ఈ ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలన్నారు. రోజుకు నాలుగు సార్లు స్కావెంజర్లతో మరుగుదొడ్లను శుభ్రం చేయించాలని చెప్పారు. గ్యాస్‌పైనే వంట చేయాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో బలపనూరు హెచ్‌ఎం నారాయణ, ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ సునందలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

కల్లూరు: పర్యావరణ పరిక్షణ మనందరి బాధ్యత అని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శనివారం కల్లూరు అర్బన్ 21వ వార్డు పార్థసారథి నగర్ పార్కులో స్పార్టన్ గ్రీన్ సంస్థ ఆధ్వర్యంలో భావ్యం విద్యార్థులతో కలసి ఆమె మొక్కలు నాటారు. ప్రతిఒక్కరూ కనీసం ఓ మొక్కను నాటి బాధ్యతగా సంరక్షించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

రేపు చిన్ని కృష్ణుల వేషధారణ పోటీలు

కర్నూలు కల్చరల్: భరత మాత మాతృ మండలి ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన వీఆర్ కాలనీలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు, విద్యార్థులకు నృత్య పోటీలు నిర్వహిస్తున్నట్లు మండలి అధ్యక్షురాలు పద్మావతి పేర్కొన్నారు. శనివారం మండలి కార్యాలయంలో వేడుకలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. పోటీల్లో పాల్గొనాలనుకునే వారు ఆదివారం సాయంత్రం 3 నుంచి 6 గంటల్లోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 94925 50433, 99665 15684 నంబర్లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండలి సభ్యులు జయలక్ష్మి, స్వప్న, శ్రీదేవి, అనురాధ, మహాలక్ష్మి, కృష్ణవేణి, హేమలత, మల్లికార్జునరెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



మండల మీట్‌లో మాట్లాడుతున్న కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

కోడుమూరు రూరల్: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి సూచించారు. గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ సునీత అధ్యక్షతన ఎంపీడీఓ విజయసింహారెడ్డి మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గూడూరు మండలంలోని గ్రామాల్లో ప్రజలు తాగునీరు, డ్రైనేజి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ రామాంజినేయులు మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయానికి నూతన భవనాన్ని నిర్మించాలని కోరగా ప్రభుత్వం దృషికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎంపీపీ మాట్లాడుతూ గూడూరు మండలంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధుల కొరత తీవ్రంగా ఉందన్నారు. గూడూరుకు శాశ్వత నీటి సమస్యను పరిష్కరించడంతో పాటు, విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని కోరారు. గూడూరు బాలికల వసతి గృహంలో వసతులను ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఏఓ శ్రీవర్ధన్‌రెడ్డి, ఎంఈఓ సునీలమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, ఎలక్ట్రికల్ ఏఈలు సన, గోపాల్‌రావు, శ్రీనివాసనాయక్ తదితర అధికారులు వారి శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను వివరించారు.


ఉద్యోగులు సమయపాలన పాటించాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాముడు

సి.బెళగల్: ఉద్యోగులు సమయపాలన పాటించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ రాముడు హెచ్చరించారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో శనివారం ఎంపీడీఓ పర్యటించారు. ముందుగా కొత్తకోట సచివాలయాన్ని ఎంపీడీఓ సందర్శించారు. అయితే సచివాలయ ఉద్యోగులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. రికార్డులను పరిశీలించారు. అప్పుడే కొందరు ఉద్యోగులు రావడంతో సమయపాలన తెలియదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులపట్ల నిర్లక్ష్యం వహించిన ఉద్యోగులకు నోటీసులు జారీ చేయాలని మండల పరిషత్ కార్యాలయ పర్యవేక్షకుడు శ్రీనివాసులను ఆదేశించారు. అనంతరం ఈర్లదెన్నె చెత్తసేకరణ కేంద్రాన్ని పరిశీలించిన ఎంపీడీఓ పనులు పూర్తి చేయించాలని సర్పంచ్ పెద్దక్కకు సూచించారు. తదనంతరం ముడుమాల, కొండాపురం గ్రామ సచివాలయాలను తనిఖీ చేసిన ఎంపీడీఓ ఉద్యోగులు విధులపట్ల అలసత్వం వహించడాన్ని గమనించి పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



నిరసన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థినులు

కల్లూరు: కలకతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కళాశాల కరస్పాండెంట్ ఎస్.విజయ లక్ష్మమ్మ డిమాండ్ చేశారు. దూపాడు సమీపంలోని కేవీ సుబ్బారెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో శనివారం హత్యాచారం ఘటనను ఖండిస్తూ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల రక్షణకు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కన్నా కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోండి



ఓపెన్ స్కూల్ బుక్‌లెట్లను విడుదల చేస్తున్న తహసీల్దార్,ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్లు

గడివేముల: బడి మధ్యలో మానేసిన విద్యార్థులు ఓపెన్ స్కూల్ (సార్వత్రిక విద్యాపీఠం)ను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ విద్యాసాగర్, ఎంఈఓ మేరీ సునీత సూచించారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రం గడివేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి పాత బస్టాండ్ వరకు హెచ్‌ఎంలతో పాటు ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్‌లు, విద్యా సంక్షేమ సహాయకులు ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ పది, ఇంటర్‌ను ఇంటి వద్దనే చదువుకుంటూ పరీక్షకు హాజరై పూర్తి చేసే అవకాశం ఉందన్నారు. ఓపెన్ స్కూల్‌లో చదివిన విద్యార్థులు అన్ని రకాలైన ఉద్యోగ అవకాశాలతో పాటు ఉన్నత చదువులకు అర్హులన్నారు. ఓపెన్ స్కూల్ వివరాల బుక్‌లెట్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రవి, వెల్ఫేర్ అసిస్టెంట్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



చికిత్స పొందుతున్న యువకులు

ఓర్వకల్లు: మండలంలోని జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. సంఘటన వివరాల మేరకు కల్లూరు మండలం, లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఓ కుటుంబ సభ్యులు శనివారం రంగాపురంలో జరిగిన బంధువుల పెళ్లికి వెళ్లారు. అనంతరం బేతంచెర్లలో ఆటోఎక్కి స్వగ్రామానికి బయలుదేరారు. మార్గం మధ్యలో హెచ్.కొట్టాల చేరుకోగానే వెనకనుంచి ఓ కారు ఆటోను ఢీ కొట్టింది. ప్రవీణ్, అభిషేక్‌కు తీవ్ర రక్తగాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి కారణమైన కారును అదుపులోకి తీసుకున్నారు. క్షతగాత్రులను స్థానిక సీహెచ్‌సీ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సునీల్‌కుమార్ తెలిపారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

ఓర్వకల్లు: ఓర్వకల్లు ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఈ నెల 20వ తేదీన రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి కోలుకోలేక శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు నంద్యాల జిల్లా, జూపాడుబంగ్లా మండలం, పారుమంచాలకు చెందిన వడ్డెమాను సుధాకర్‌నాయుడు(50) తన భార్య పుట్టినిల్లు కేతవరం గ్రామానికి వెళ్లారు. అదే రోజు తన చెల్లెలితో రాఖీ కట్టించుకునేందుకని హుసేనాపురం మానికి చేరుకున్నాడు. రాఖీ కట్టించుకొని తిరిగి కేతవరం గ్రామానికి వెళ్తుండగా ఓర్వకల్లు ఫ్లైఓవర్ బ్రిడ్జిపై గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సుధాకర్‌ను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్సపొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సునీల్‌కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె జాతీయ రహదారిపై ఎస్ టర్నింగ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలైనట్లు హైవే పెట్రోల్ సిబ్బంది తెలిపారు. హైదరాబాద్ నుంచి అరుణాలానికి కారులో వెళ్తుండగా ఎస్ టర్నింగ్ వద్ద మలుపుదాటే క్రమంలో కారు బోల్తా పడిందన్నారు. హైవే సిబ్బంది జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్య లేకుండా చేశారు.